జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 27-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 136 పేజీలు: 8 వెల : రూ.7

# తప్పు చేసిన వారిని.. వదలబోం





* వెంకటేశ్వరస్వామిని జోలికి వస్తే ఏమవుతుందో ఇప్పటికే అర్థం కావాలి
* డిక్లరేషన్ సంప్రదాయాన్ని.. జగన్ పాటించాలి
* తిరుమలలో అవకతవకలపై కమిటీ వేశాం
* రెడ్ బుక్ పని ప్రారంభమైంది
* వాస్తవాలు తెలుసుకునేందుకు పాఠశాలల తనిఖీ
* విద్యార్థి మృతిపై నివేదికను కోరాం
* రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్



**శ్రీకాకుళం, సెప్టెంబరు 26 (వార్త):** వేంకటేశ్వర స్వామి జోలికి వస్తే ఏమవుతుందో ఇప్పటికే మాజీ సీఎం జగన్ రెడ్డికి అర్థమై ఉంటుందని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. అన్ని మతాలను గౌరవించాలి.. వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు. తిరుమల వెళ్తానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయాన్ని పాటించాలని హితవు పలికారు. గురువారం శ్రీకాకుళంలో పాఠశాల ఆకస్మిక పరిశీలన అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడారు. తిరుమలలో జరుగుతున్న అక్రమాలపై ఇప్పటికే ఒక కమిటీ వేశామని, నివేదిక వచ్చిన వెంటనే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదలబోమని లోకేష్ అన్నారు. తిరుమల లడ్డూ నాణ్యతాలోపంతోపాటు అనేక సమస్యలను భక్తులు నా దృష్టికి తెచ్చారన్నారు. టీటీడీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. ఎంతో పవిత్రమైన వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో నెయ్యిని కల్తీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారో మొత్తం బయటకు తీస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. జగన్ ధ్వంసం చేసిన విద్యావ్యవస్థను ఒక పద్ధతి ప్రకారం బాగుచేస్తామన్నారు. నేను జిల్లాల పర్యటనకు వెళ్లినపుడు ఒకరోజు పూర్తిగా స్కూళ్ల పరిశీలనకు కేటాయిస్తున్నానని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోవడానికి స్కూళ్లను తనిఖీ చేస్తున్నానని చెప్పారు. పాతర్లపల్లిలో నిర్మాణంలో ఉన్న నాడు-నేడు స్కూలు గోడకూలి విద్యార్థి మృతిచెందిన ఘటనపై అధికారుల నుంచి నివేదిక కోరామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు.

### వచ్చే ఏడాది నుంచి..
## ప్రతి క్లాసుకు ఒక టీచర్

* ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
* సంస్కరణల అమలు, ప్రమాణాల మెరుగుదలలో టీచర్లకు భాగస్వామ్యం
* దేశంలోనే ఆదర్శంగా ఏపీ స్కూళ్లను తయారు చేస్తాం
* రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్
* శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పాఠశాల తనిఖీ



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 26 (వార్త):** వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి క్లాసుకు ఒక టీచర్ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. శ్రీకాకుళం ఎచ్చెర్ల వీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూలులో మంత్రి నారా లోకేష్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. 1నుంచి 5వ తరగతి విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబెట్టారు. స్కూలులో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? అమ్మా,నాన్నలు ఏం చేస్తున్నారు? యూనిఫాం, ... మిగతా 7లో

## ప్రమాదకరంగా నర్సిపురం రోడ్డు

పలాస, సెప్టెంబర్ 26(వార్త): పలాస మున్సిపాలిటీలోని తాళ్లభద్ర, నర్సిపురం రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. పెద్ద గోతులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా జలమయం కావడంతో పాదచారులు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# ఉత్తరాంధ్ర వెనుకబాటు పాపం పాలకులదే



పలాస, సెప్టెంబర్ 26(వార్త): ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణమని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ఆరోపించారు. గురువారం ఆయన పలాసలో విలేఖరులతో మాట్లాడారు. టీడీపీ, వైసీపీ, జనసేన.. బీజేపీ భజన చేస్తున్నాయి తప్ప..రాష్ట్రం గూర్చి ఆలోచించడం లేదన్నారు. విభజన హామీ చట్టాన్ని అమలు చేస్తామని, వెనకబడ్డ ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని, పారిశ్రామిక అభివృద్ధి చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రకు బీజేపీ ఏం చేసిందని ప్రశ్నించారు. సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రలోని సుమారు 25 చిన్న, పెద్ద నదులను అనుసంధానించి పది లక్షల ఎకరాలకు నీరందిస్తామని చెప్పి, విఫలమయ్యారన్నారు. పోలవరంబ విషయంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఉత్తరాంధ్రకి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కును నడిబజారులో అమ్మేస్తుంటే ఈ పార్టీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హామీలన్ని నెరవేర్చాలనే డిమాండ్లతో ఈనెల 29న టెక్కలి అంబేద్కర్ భవనంలో ఓ సదస్సును నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, నాయకులు మురిపిండి తాతారావు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, ఆదివాసీ సంఘం నేత బంగ్లాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీ నోటిఫికేషన్‌లో..

# ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

***జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఫిర్యాదు**

***ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి**

జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త):ఏపీ సమగ్ర శిక్ష విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఆరోపించారు. ఈ విషయమై ఆయన గురువారం జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నోటిఫికేషన్‌లో టీచింగ్ పోస్టులు 507కు గాను ఆదివాసులకు 10 పోస్టులు మాత్రమే కేటాయించారన్నారు. రాజ్యాంగ ప్రకారంగా ఆదివాసులకు 6% రిజర్వేషన్ కల్పించాలని నిబంధనలు ఉన్నా, ఈ నోటిఫికేషన్ అందుకు విరుద్ధంగా ఉందన్నారు. టీచింగ్ పోస్టులు ఆదివాసీలకు 30 కేటాయించాలన్నారు. నాన్ టీచింగ్ 97 పోస్టుల్లో ఒకటి కూడా ఆదివాసీలకి కేటాయించ లేదని వాపోయారు. ఆంధ్ర రాష్ట్రంలో సుమారుగా లక్షలాది మంది ఆదివాసీ నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి శిక్షణ తీసుకొని ఎదురుచూస్తున్నారన్నారు. కానీ వారి ఆశలను ఈ ప్రభుత్వం అడియాశలు చేసిందని వాపోయారు. ఈ నోటిఫికేషన్ రద్దు చేయాలని, లేకుంటే ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన మేరకు ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.




# శ్రీముఖలింగేశ్వర ఆలయానికి సీసీ రోడ్డు

**-శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయానికి ఉత్తర, పడమర వైపు సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల నిధులతో ఈ పనులను చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలి ప్రతినిధి మెండ రాంబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల చంద్రభూషణ్, కింజరాపు సత్యం, సర్పంచ్‌లు తమ్మనగారి సతీష్‌కుమార్, పంచిరెడ్డి రామచంద్రరావు, గరుగుబిల్లి రమణమూర్తి, తర్ర బలరాం, పొన్నాన దాలయ్య, దేవా, గుండ మన్మథరావు, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కోబకాపు కుటుంబాన్ని పరామర్శించిన ప్రవీణ్



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): పర్లాం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కోబకాపు నరసునాయుడు, కోబకాపు రమణను నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి యోగహరి, గ్రామ పెద్దలు రాజగోపాలరావు, తులసిబాబు, అనంతరావు, తవిటినాయుడు, జగన్, కోటేశ్వంరావు, తాడేల అప్పన్న, బుచ్చింనాయుడు, గునాపు రమేష్, టీడీపీ నేత ఉత్తరకుమార్, పర్లాం గ్రామ జనసైనికులు అంధవరం చంటి ఉన్నారు.

## కొమనాపల్లి పాఠశాల ఆకస్మిక తనిఖీ



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంఈవో ప్రసాదరావు సూచించారు. గురువారం ఆయన కొమనాపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఖాళీ సమయంలో బయటకు పంపించవద్దని ఆదేశించారు. చుట్టుపక్కల శిథిల ప్రదేశాలు ఉంటే వాటి జోలికి వెళ్లకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్ చిన్నరాజులు తెలిపారు. గురువారం ఆయన మట్టవానిపేట గ్రామం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఆ గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

## వ్యర్థాలతో దుర్వాసన

నరసన్నపేట, సెప్టెంబర్ 26(వార్త):నరసన్నపేట కాలేజీ రోడ్‌లో కూరగాయలు తదితర మార్కెట్ వ్యర్థాల దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. జెడ్పీహెచ్ స్కూల్ ఎదురుగా ఉన్న చెరువులో కుళ్లిన కూరగాయల వేయడంతో కంపు కొడుతోందన్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## స్వర్ణాంధ్ర 2047పై డ్రాయింగ్ పోటీలు



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): జలుమూరు మండలం అల్లాడ జడ్పీహెచ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ పోటీలను పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించిన బగ్గు



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు





జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): అల్లాడ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో ప్రమాదాలు జరగకుండా గురువారం చర్యలు చేపట్టామని హెచ్ఎం, పీడీ తెలిపారు. పెద్దదూగం జడ్పీహెచ్ఎస్ స్కూల్లో కూడా ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని హెచ్ఎం, పీడీ తెలిపారు. మేడ పైకి వెళ్లకుండా వెదురు బొంగులతో గేటు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించామన్నారు.

## హనుమాన్ నగర్‌లో డెంగ్యూ కేసు నమోదు



నరసన్నపేట, సెప్టెంబర్ 26(వార్త): నరసన్నపేటలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న హనుమాన్ నగర్లో డెంగ్యూ కేసు నమోదైందని మాకివలస ప్రాథమిక ఆసుపత్రి ఆరోగ్య సహాయకులు ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు రోగిని ఏరియా ఆసుపత్రికి తరలించమన్నారు. గురువారం ఆ ఇంటిని పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును చల్లించామన్నారు. ఆయన వెంట సహాయ మలేరియా ఆఫీసర్ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు ఉన్నారు.

## ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

నరసన్నపేట, సెప్టెంబర్ 26(వార్త): గొట్టిపల్లి పంచాయతీలో యువకులు రక్తదానం చేపట్టారు. ఎన్టీఆర్ సినిమా శుక్రవారం విడుదల సందర్భంగా గురువారం స్థానిక పాఠశాల భవనం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 30 మంది రక్తదానం చేశారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# ఎమ్మెల్యే మామిడికి పౌర సన్మానం



పాతపట్నం, సెప్టెంబరు 26(వార్త) : పాతపట్నం మండలం రౌతులక్ష్మీపురంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు సర్పంచ్ దంపతులు అంపోలు శ్రీదేవి, మధుబాబు పౌర సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు పార్టీ నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్, యారబాటి సన్యాసిరావు, డోల్ల సంపతరావు, బూడిద వీరభద్రరావు, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### రైతుల సమస్యపై వినతిపత్రం

**కొత్తూరు:** కర్లెమ్మ భూములు రీసర్వేలో భాగంగా అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకొని భూ యజమానులకు న్యాయం చేయాలని పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యుడు మామిడి గోవిందరావుకు ఆ గ్రామ రైతులతో కలిసి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. సమగ్ర విచారణ జరిపి ఈ సమస్యకు కారణమైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి




వంగర, సెప్టెంబర్ 26(వార్త): ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి చేయాలని డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు. గురువారం ఆయన అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆట, పాటలన్నీ నేర్పాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. మెనూ తప్పని సరిగా అమలుచేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎంఈవో-2 వై.దుర్గా రావు, ఎంపీడీవో ఎల్.త్రినాథరావు, అరసాల సర్పంచ్ ప్రతినిధి లచ్చుభుక్త కృష్ణమూర్తి, హెచ్ఎం జగదీశ్వరి, ఉపాధ్యాయులు, ఆ గ్రామ పెద్దలు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వంగర పీఏసీఎస్‌లో రుణ బకాయిలు రూ.23కోట్లు



వంగర, సెప్టెంబరు 26 (వార్త): వంగర ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు పరిధిలో రైతులు రూ.23కోట్లు చెల్లించాల్సి ఉందని రాజాం సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ వి.మాధవీలత తెలిపారు. గురువారం ఆమె వంగరలో విలేఖరులతో మాట్లాడారు. ఈ బ్యాంకులో తీసుకొన్న వివిధ రకాల రుణాల చెల్లింపునకు రైతులు సహకరించడం లేదని తెలిపారు. మడ్డువలస ప్రాజెక్టు నిర్మాణంతో కొన్ని గ్రామాల్లో ప్రజలు బయటకు వెళ్లిపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ మండలంలో 6607 మందికి సభ్యత్వం ఉండగా, 1882 మంది రూ.23 కోట్ల రుణాలు తీసుకున్నారనారు. రాజాం డీసీసీబీ పరిధిలోరూ.188కోట్ల వరకూ రుణాలు అందజేసినట్లు చెప్పారు. ఇందులో రూ.166 కోట్ల వరకూ రుణాలు చెల్లించినట్లు ఆమె తెలిపారు. 90 శాతం వరకూ వసూలైందన్నారు. రైతులతో వంగర సెంట్రల్ బ్యాంక్‌లో జరగాల్సిన మహాజన సమావేశానికి రైతులు పూర్తిగా హాజరుకాక పోవడంతో వాయిదా పడిందన్నారు. సమావేశంలో వంగర సొసైటీబ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి అరుణశ్రీ పాల్గొన్నారు.

## పౌష్టికాహార మాసోత్సవాలు



పోలాకి, సెప్టెంబర్ 26(వార్త): పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు జరిపారు. విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీతో పాటు అవగాహన సదస్సును నిర్వహించారు. పౌష్టికాహార లోపంతో కలిగే వ్యాధులు వస్తాయన్నారు. ఆశవర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వితరణ



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): సైరిగాం పాఠశాల పూర్వ విద్యార్థి ముద్దాడ మాధవరావు తన కుమారుడు పూర్విక్ సాయి రెండో జన్మదినం సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులకు రూ.3000విలువ గల భోజన ప్లేట్లు, అప్సర పెన్సిల్ కిట్లు, గోడ గడియారం అందించారు. అరటి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు మందసలో విద్యుత్ అంతరాయం

మందస, సెప్టెంబరు 26(వార్త): మందస మండలంలోని కొన్ని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యోగీశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.యోగి చెప్పారు. చెట్ల కొమ్మలు తొలగించుట, విద్యుత్ లైన్స్ నిర్వాహణ దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మందస సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ మేఘమాల ఫీడర్ పరిధిలో గల ఆర్‌డబ్ల్యుఎస్, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని వారు కోరారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



శ్రీకాకుళం

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

సారవకోట, సెప్టెంబర్ 26(వార్త): లింగాలపాడు గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో గురువారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



## పాలన సంతృప్తికరం

గార, సెప్టెంబర్ 26(వార్త): రాష్ట్ర ప్రజలకు సంతృప్తికర పాలనందు తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం ఇబ్రహీం బాద్‌లో గురువారం ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న ఇది మంచి ప్రభుత్వమన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని సంక్షేమ అభివృద్ధి పథంలోకి తీసుకెళు న్నార న్నారు. కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం గాకుండా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేదిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తు న్నామన్నారు. అందులో భాగంగా మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువ తకు అండగా నిలబడుతూ, పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా కేవలం రూ.5కే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. పింఛన్లు ఒకే సారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గార మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అందరికీ సంక్షేమ ఫలాలే లక్ష్యం



జలుమూరు, సెప్టెంబర్ 26(వార్త): శ్రీముఖలింగం గ్రామంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని, ఈ 100 రోజుల పాలనలో సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలతో ప్రజలతో 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించారన్నారు. అవ్వ,తాతల పెన్షన్ రూ.4000, వికలాంగుల పెన్షన్ రూ.6000, లక్షలాదిమంది పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్లు', యువత భవిష్యత్తుకు 'మెగా డీఎస్సీ" లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలమల చంద్రభూషణ్, కింజరాపు సత్యం, సర్పంచ్‌లు తమ్మనగారి సతీష్‌కుమార్, పంచిరెడ్డి రామచంద్రరావు, గరుగుబిల్లి రమణమూర్తి, తర్ర బలరాం, పొన్నాన దాలయ్య, దేవా, గుండ మన్మథరావు, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు, సెప్టెంబరు 26(వార్త): కొత్తూరు మండలంలోని ఇరపాడు ఆర్ఆర్ కాలనీ బిట్-3లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాతపట్నం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు జగన్ పాలనపై విసుగు చెంది ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడానికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు సంపూర్ణ మెజారిటీతో అధికారం కట్టబెట్టారని తెలిపారు. హామీలను త్వరితగతిన నెరవేర్చిన ఘనత కూటమి ప్రభు త్వానికే చెల్లుతుందన్నారు.

కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారు లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సోంపేట, సెప్టెంబర్ 26(వార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక చేపట్టిన మన ప్రభుత్వ కార్యక్రమం సోంపేట మండలం రామయ్యపట్నంలో గురువా రం పార్టీ నాయకుడు నిట్ట గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటి కీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించా రు. గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వ ర్యంలో ప్రజలకు అందుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురుమూర్తి, సీహెచ్ శంకర్, నీలవేణి, పి.మోహనమ్మ, జి.వల్లభరావు, జాన కమ్మ, వాసుపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.





పాతపట్నం, సెప్టెంబరు 26(వార్త): కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా ఆర్ఎల్ పురంలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పరిస్థితులు చూసిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు జగన్ పాలనపై విసుగు చెందారన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలనే ధృఢ నిశ్చయంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీలకు పూర్తి అధికారం అందించారని తెలిపారు. పెంచిన పింఛన్లు సకాలంలో పంపిణీ, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు మంజూరు, అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ వంటి ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

## అర్బన్ మార్కెట్లతో ఆర్థిక తోడ్పాటు



**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబర్ 26(వార్త):** పట్టణ స్వయం సహాయక సంఘాల ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్ల నిర్వహణ చేస్తున్నట్లు పీడీ ఎస్‌వీ రమణ తెలిపారు. గురువారం స్థానిక రైతుబజార్ సమీపంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. స్వయం సహాయక సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసి, వారిలో నైపుణ్యతను, పోటీతత్వం పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని నగరపాలక సంస్థతోపాటు, మూడు పురపాలక సంఘాలలో పట్టణ ప్రగతి, సమృద్ధి యూనిట్లు ఏర్పాటు చేసి ప్రోత్సహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు పాల్గొన్నారు.

### నేడు విభిన్న ప్రతిభావంతుల
## స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 26(వార్త):** విభిన్న ప్రతిభావంతుల స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్ శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని విభిన్న ప్రతిభావంతుల, సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. ఉదయం పది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



**పాతపట్నం, సెప్టెంబర్26 (వార్త):** పాతపట్నం మండలం భగంతర గ్రామానికి చెందిన వాం డ్రాడ రాజు (32) విద్యుదాఘాతంతో మృతి చెం దారు. పోలీసులు అందించిన వివరాలు మేరకు.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పెరడులోకి మూత్ర విసర్జన నిమిత్తం వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తుండగా వారి ఇంటికి వెనక వంట పాకకి మధ్యలో గల కరెంటు వైరుకి ప్రమాదవ శాత్తు తగిలి విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. భార్య రజినీ, తండ్రి పోలయ్యలు చూసి అటు వైపు వెళ్లే విద్యుత్ లైన్ ఆపి అతన్ని ఆటోలో పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే రాజు మరణించినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య రజినీ ఇచ్చిన రిపోర్ట్ మేరకు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

## భూగర్భగనులు శాఖ డీడీగా మోహనరావు



**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబర్ 26(వార్త):** భూగర్భగనులు శాఖ డీడీగా సి.మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కమిషనరేట్‌లో పనిచేస్తూ బదిలీపై శ్రీకాకుళం డీడీగా వచ్చారు. ఆ శాఖ అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.

## ఉప్పాడవీధిలో పారిశుధ్యంపై అవగాహన

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 26 (వార్త):** మున్సిపాలిటీ పరిధి 14 వార్డు ఉప్పాడ వీధిలో గురువారం పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం కార్యాలయంను శుభ్రం చేయించారు. అలాగే మెయిన్ రోడ్డును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, సచివాలయం వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పదవులు కాదు..
# చేసిన పనులే శాశ్వతం

* మత్స్యకారులకు అండగా నిలుస్తాం
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* అంధకారంలో ఉన్న ఏపీని వెలుగులోకి తెస్తున్నాం
* కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
* మంచినీళ్లపేటలో 'ఇది మంచి ప్రభుత్వం'


**వజ్రపుకొత్తూరు, సెప్టెంబర్ 26 (వార్త):** పదవులు శాశ్వతం కాదు. చేసిన మంచి పనులు శాశ్వతమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేకంగా మళ్లీ ఉద్యానవన శాఖ ఏడీ కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. పాడేరు తరలిపోయిన కార్యాలయాన్ని వంద రోజుల్లో తెప్పించుకున్నామన్నారు. గురువారం వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వేటకు వెళ్లి మత్స్యకారులు దురదృష్టవశాత్తూ చనిపోతే రూ.10 లక్షలు పరిహారాన్ని ఇచ్చేలా గత వంద రోజుల్లోనే నిర్ణయాలు జరిగాయన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయగలిగామని చెప్పారు. పలాసలో వంతెనలకు అప్రోచ్ కూడా వేయలేని గత ప్రభుత్వాన్ని చూశామని తెలిపారు. సముద్రానికి ఆనుకుని రహదారి నిర్మిస్తామని చెప్పారు. ఆర్థిక సమస్యలు ఉండడం వల్ల ఇచ్చిన హామీలను ఒక్కొక్కటీ అమలు చేస్తామన్నారు. దీపావళి నుంచి మూడు సిలిండర్ల హామీ నెరవేరుస్తామన్నారు. 2017లో మేము అన్ని అనుమతులు ఇచ్చిన ఫిష్ ల్యాండ్ సెంటర్‌ను పూర్తి చేస్తామన్నారు. వేటకు వెళ్లే బోట్లకు శాటిలైట్ సిస్టం అందజేస్తామని తెలిపారు. చేపలు సమృద్ధిగా దొరికేలా, వాతావరణ సమాచారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అంధకారంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి వెలుగుల్లోకి తెచ్చిందని, వంద రోజుల పాలనలో ఎన్నో ఘనతలు సాధించామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గత 100 రోజుల్లో మెరుగైన లక్ష్యాలను చేరుకున్నామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల అయ్యాయని మంచి పనులు చేపట్టాలని కోరారు. స్వర్ణాంధ్ర, స్వర్ణ శ్రీకాకుళం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక శాసన సభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ మత్స్యకారులు ఎప్పుడూ మా మంచి ప్రభుత్వానికి అండగా నిలిచారన్నారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే వంశధార నీటిని పలాస, వజ్రపుకొత్తూరుకు తీసుకువచ్చి పని చేసే ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. వీలైనంత త్వరలోనే మత్స్యకారులకు రూ.20 వేలు ఇచ్చే పని ప్రారంభిస్తామన్నారు. మత్స్యకారుల కోసం ఇక్కడే ఫిషింగ్ జెట్టి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



### ప్రైవేట్ దందాపై..
# అధికారుల మౌనం

* ట్రావెల్స్ బస్సులపై అనధికారికంగా సరుకుల రవాణా * ప్రమాదమని తెలిసినా పట్టించుకోని యంత్రాంగం * ట్రావెల్స్ బస్సు పై లాజిస్టిక్స్ పేరుతో రవాణా * జీఎస్టీ ఎగవేసి సరుకుల రవాణాతో ప్రభుత్వ ఖజానా గండి * విజయవాడ నుంచి టెక్కలికి నిషేధిత వస్తువుల రవాణాపై అనుమానం

**టెక్కలి, సెప్టెంబర్26 (వార్త):** ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ట్రాన్స్పోర్ట్ వాహనాలను తలపిస్తున్నాయి ప్రయాణికులు ప్రాణాలు ప్రాణంగా పెట్టి తమ స్వలాభం కోసం అత్యధిక బరువులతో సరుకులు రవాణా చేస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ప్రమాదాలు జరిగితేనే అధికారులు స్పందిస్తారంటూ అధికారుల తీరుపై బహిరంగ విమర్శలు వినబడుతున్నాయి.. నెలవారి మామూలు మత్తులో కొందరు అధికారులు చేస్తున్న నిర్వాకం ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుండగా.. ప్రజలకు ప్రమాదకరంగా మారాయి. ట్రావెల్ బస్సులపై లాజిస్టిక్స్ పేరుతో బహిరంగంగా సరుకు రవాణా చేస్తున్నారు. చిన్న చితక వాహనాలపై ఓవర్ లోడ్ కేసులు వేసే పోలీస్, ఆర్టీఏ అధికారులు కనీసం ఈ ప్రైవేట్ వాహనాలపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల కోసం తిరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ట్రాన్స్పోర్ట్ వాహనాలను తలపిస్తున్నాయి. నిత్యం బస్సు పై భాగంలో అత్యధిక బరువులతో సరుకులను రవాణా చేస్తున్నారు, ముఖ్యంగా విజయవాడ నుంచి టెక్కలికి ప్రతిరోజు పలు ప్రైవేట్ ట్రావెల్స్ తదితర బస్సుల్లో అత్యధికంగా సరుకులు అనధికారికంగా రవాణా అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వానికి చెల్లించవలసిన జీఎస్టీ చెల్లించకుండా అనధికారికంగా ఈ వస్తువులు రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ఎటువంటి బిల్లులు లేకుండా ప్రైవేట్ బస్సులు తమ ఆదాయం కోసం రవాణా చేస్తున్న కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్ బస్సు నుంచి ముడుపులు అందుతున్న వారిని నేపథ్యంలోనే అధికారులు ఎవరూ తనిఖీలు చేపట్టడం లేదని తెలుస్తోంది. విజయవాడ నుంచి బరువైన హార్డువేర్ సామాగ్రి టెక్కలికి వస్తున్న కనీసం అధికారులు ఎవరూ తనిఖీలు కూడా చేయకపోవడం బాధాకరం టెక్కలి ప్రాంతంలో అత్యధికంగా గ్రానైట్ పరిశ్రమ ఉండటం వలన ఈ పరిశ్రమకు అవసరమైన హార్డ్వేర్ వస్తువులతో పాటు జలిటిన్ స్టిక్స్ లాంటి ప్రమాదకార వస్తువులు కూడా టెక్కలికి రవాణా అవుతున్నాయని తెలుస్తోంది. అంతేకాకుండా టెక్కలి నుంచి నిషేధిత గుట్కా, గంజాయి లాంటి పదార్థాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా రవాణా జరుగుతుందని విమర్శలు వినబడుతున్నాయి.




### కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేట్ బస్సులు బారులు

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పాత జాతీయ రహదారిపై ప్రైవేటు వాహనాలు బారులు తీరుతున్నాయి. నిబంధనల ప్రకారం ఆర్టిసి కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేటు వాహనాలు నిలపకూడదు. ఈ నిబంధనను ప్రైవేటు వాహనాలు కనీసం ఖాతర చేయడం లేదు. గంటల తరబడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రోడ్డుపై బస్సులు నిలిపివేసి పెద్ద ఎత్తున హారన్ వేస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఉన్న ప్రయాణికులను ప్రైవేట్ వాహనాలు ఆకర్షిస్తున్నారు. కాంప్లెక్స్ ఎదురుగా గంటల తరబడి ప్రైవేట్ వాహనాలు ఎదురు చూడటం వలన ఆర్టీసీకి భారీ ఎత్తున నష్టం కలుగుతున్న పట్టించుకునే నాధుడే కరువవుతున్నాడు. వాస్తవంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పాత జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులు వేచి ఉండడానికి కూడా స్థలము ఉండడం లేదు. ప్రస్తుతం దసరా సీజన్లో ఈ ప్రైవేట్ వాహనాలు తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రైవేటు వాహనాలను నియంత్రించవలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ముద్దాయిలకు న్యాయ అవగాహన

**శ్రీకాకుళం లీగల్, సెప్టెంబర్ 26 (వార్త):** జిల్లా కారాగారంలో ఉన్న ముద్దాయిలకు న్యాయ అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా అవగాహన కల్పించారు. ముద్దాయిలు ఎదుర్కొంటున్న సమస్యలుపై వారికి న్యాయపరమైన సేవలు నిమిత్తం పలు సూచనలు చేశారు. ఆయన వెంట శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది నుంచి.. ప్రతి క్లాసుకు ఒక టీచర్

(మొదటిపేజి తరువాయి)

బ్యాగ్స్ బాగున్నాయా? తదితర ప్రశ్నలు వేశారు. అనంతరం ఉపాధ్యాయులు, ఎంఈవోతో మంత్రి సమావేశమయ్యారు. ప్రభుత్వ స్కూళ్లపై అవగాహన కోసమే తాను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్కూలు నిర్మాణం జరిగి వంద సంవత్సరాలు అయిందని టీచర్లు చెప్పగా, మంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, తామే సొంతంగా రూ.50వేలు ఖర్చుచేసి చిన్నచిన్న మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. నాడు-నేడు ఫేజ్ -1, ఫేజ్ -2 లో తమ స్కూలుకు ఎటువంటి నిధులు విడుదల కాలేదన్నారు. వర్షం వచ్చినపుడు తరగతి గదుల్లోకి నీరు వస్తోందని, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ స్కూళ్లలో తొలుత కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, తర్వాత అన్నింటినీ ఒకేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు కలెక్టర్ నుంచి టీచర్ వరకు అందరూ భాగస్వామ్యం వహించాలని కోరారు. రాబోయే అయిదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా ఏపి స్కూళ్లను తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా పలు తప్పులు జరిగాయని, ఈసారి అలాంటివి చోటుచేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా సంస్కరణలు అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో పరిస్థితులన్నింటినీ ఒకేసారి మార్చడం సాధ్యం కాదని చెప్పారు. స్కూళ్లలోని మౌలిక సదుపాయాల వాస్తవ చిత్రాలను





ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో అప్‌లోడ్ చేయాలని ఎంఇఓను ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్కూళ్లలో నాణ్యత పెంచేందుకు టీచర్ల సలహాలు తీసుకున్నారు. సబ్జెక్టులవారీగా బోధనకు స్కూల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కొన్నింటిని సరిచేశామని, వచ్చే ఏడాది మరింత పకడ్బందీగా అమలుచేస్తామని చెప్పారు. మంత్రి లోకేష్ వెంట ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ఉన్నారు.



### తిరుపతి లడ్డు ప్రసాదానికి..
## పలాస జీడిపప్పు

*** వాహనాన్ని ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు**

**పలాస, సెప్టెంబర్ 26 (వార్త):** తిరుపతి లడ్డు ప్రసాదానికి పలాస జీడి పప్పును గురువారం పంపించారు. జీడిపప్పు తరలించే గరుధ వాహనాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రోజుకు మూడు టన్నుల జీడిపప్పు తిరుమల తిరుపతి దేవస్థానానికి రవాణా చేసేందుకు ఆన్ లైన్ ట్రేడింగ్‌లో బిడ్ వేసి టెండర్‌ను ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రో ప్రొడక్ట్స్ కంపెనీ యజమాని సంతోష్ కుమార్ దక్కించుకున్నారన్నారు. తొలి విడతగా క్వాలిటీ, క్వాంటిటీతో కూడిన జీడి పప్పును పంపించామని, శ్రీవారి చెంతకు జీడిపప్పు పంపించే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందన్న సంతోష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### సుందర సిక్కోలుకు..

*** చెత్తను నదుల్లో వేయవద్దు * నాగావళి, వంశధార నదుల పరిరక్షణకు పాటుపడాలి**
*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * నాగావళి నదిలో స్వచ్ఛత హి సేవా**

# ప్రజలు సహకరించాలి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 26 (వార్త):** శ్రీకాకుళాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఏడు రోడ్ల కూడలి వద్ద ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ వద్ద నాగావళి నది తీర ప్రాంతంలో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, శాసన సభ్యుడు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నది ఆవరణలో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగావళి, వంశధార నదుల పరిశుభ్రత పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. నగరంలో అన్ని ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీటిని ఒకే ప్రాంతానికి చేర్చి దానిని శుభ్రపరచి నదిలో వదిలే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇందుకు నిధులు, భూమిని కూడా కేటాయించినట్లు చెప్పారు. అన్ని ప్రాంతాల నుండి సేకరించిన చెత్తను రివర్ వ్యూ పార్క్ దగ్గరలో డంప్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు వినియోగించే కొబ్బరి బొండాలు, డైపర్స్, శాంపూ ప్యాకెట్లు, తదితరమైన వ్యర్థ పదార్థాలు నదీ తీర ప్రాంతంలో వేయరాదని, వ్యర్థాలను ఇంటి వద్దే వుండనిస్తే పారిశుధ్యం కార్మికులు వచ్చి తీసుకు వెళతారన్నారు. సేకరించిన చెత్తను విశాఖపట్నంలో గల వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌కు తరలిస్తామన్నారు. రోడ్లు పైన, కాలువల్లో చెత్త వేస్తున్నారని, ఇక నుంచి దీన్ని





మానుకోవాలని హితవు పలికారు. స్వచ్ఛత హి సేవా ఒక్క శ్రీకాకుళంలోనే కాదు జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు ఉంటుందని, ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ నదులు దైవాలతో సమానమని, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నాగావళి, వంశధార నదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. శ్రీకాకుళం నగరంలో నాగావళి నది ప్రవహించే ఒడ్డున సుందరమైన పార్కులు, చక్కని రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని మిర్తి బట్టి పనులను పున:ప్రారంభిస్తామన్నారు. నదీ పరివాహక ప్రాంతం ప్రక్క నుండి ఒక రోడ్డు ఏర్పాటు చేసి నగరవాసులు నడచుకోడానికి, సైక్లింగ్, చిన్న, చిన్న వాహనాలను డైవర్ట్ చేయవచ్చని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడమైనదని తెలిపారు.నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలంతా తమ వంతు సహాయ సహకారాలు అందించి స్వచ్ఛతో నగరానికి మంచి ర్యాంకు రావడానికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో కూడా పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించడమైనదన్నారు. పోలీసు స్టేషన్లే కాకుండా పరిసరాలను శుభ్రపరచు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నిత్య జీవితంలో పరిశుభ్రతను ఒక భాగంగా చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం పార్కులో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మొక్కలు నాటి పెయిటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి. తారక ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బి. కరుణశ్రీ, రిటైర్డ్ ఆర్డీఓ పిఎంజె బాబు, ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

**ఆమదాలవలస, సెప్టెంబర్ 26(వార్త):** మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితం, జంతు శాస్త్రం మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ బోధనకు గెస్ట్ లెక్చరల్ పోస్టులను భర్తీ చేసేందుకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎమ్మెస్సీ జువాలజీ , ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ఏభై అయిదు శాతం ఉత్తీర్ణత సాధించి ఏపీ సెట్, యుజిసి నెట్, పీహెచ్డీ అర్హత ఉన్నవారికి మొదట ప్రాధాన్యం ఇవ్వబడుతుందని అన్నారు.ఈ లెక్చరర్ పోస్టులకు సంబంధించి డెమో ద్వారా ఎంపిక చేయడంతో పాటు విద్యార్థుల అభిప్రాయ సేకరణ, మెరిట్ పై నియామకాలు చేపడతామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ మూడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలనికోరారు. దరఖాస్తులను నేరుగా కళాశాల కార్యాలయానికి అందించాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9440526302, 8074649919 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని, అభ్యర్థులకు ఇంటర్వ్యూలను అక్టోబర్ 4వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణరావు తెలియజేశారు.




## పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 26 (వార్త):** జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు, ఆర్మ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది, ఇతర విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 32 మంది పోలీసులు వారి యొక్క శాఖ పరమైన, ఉద్యోగరీత్యా, వ్యక్తిగత సమస్యల గురించి జిల్లా ఎస్పీకి విన్నవించారు. పోలీసు సిబ్బంది బదిలీలు, సీనియారిటీ ప్రమోషన్స్, సరెండరు లీవ్స్ మంజూరు, ఇన్కమ్ టాక్స్ రికవరీ, ఆరోగ్య పరమైన సమస్యలు వంటి విషయాలపై వివరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత జిల్లా పోలీస్ కార్యాలయ(డిపివో) అధికారులతో ఎస్పీ మాట్లాడి, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించారు.

## వరదబాధితులకు న్యాయవాదులు 15 లక్షల విరాళం



**వంగర, సెప్టెంబర్ 26 (వార్త):** రాష్ట్రంలో ఇటీవలన సంభవించిన వరద బాధితుల సహాయార్థం వంగర మండలం రుషింగి గ్రామానికి చెందిన సుప్రీం కోర్టు న్యాయవాది ఎలకల రాజగోపాలరావు ఢిల్లీ సుప్రీంకోర్టు తెలుగు న్యాయవాదులు రూ. 15 లక్షలను అందజేశారు. న్యాయవాదులు యలకల రాజగోపాలరావు, అల్లంకి రమేష్, చంద్రమోహన్, పట్టాభిరామ్ తదితరులు ఏపి ముఖ్యమంత్రి సహాయనిధికి 15 లక్షల రూపాయల విరాళాన్ని ఢిల్లీలోని ఎ.పి. భవన్ రెసిడెంట్ కమిషనరుకు అందజేశారు. అనంతరం సుప్రీంకోర్టు అడ్వకేట్ రాజగోపాల్ రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వరద బాధితులను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అందరూ తలో చెయ్యి వేసి బాధితులను ఆదుకోవాలన్నారు.

## సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారులు




**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 26 (వార్త):** హైదరాబాదులో ఈనెల 27వ తేదీ నుండి జరగనున్న సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనేందుకు క్రీడాకారులు తరలి వెళ్లారు. అండర్ 19 బాయ్స్ విభాగంలో పోటీ పడ నున్నారు. జ్ఞాన భారతి పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా ఈనెల 27వ తేదీ నుండి గుంటూరులో జరిగే సిబిఎస్ ఈ క్లస్టర్ 7 బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనేందుకు బాలుర జట్టు బయలుదేరి వెళ్లింది. బ్యాట్మెంటన్ పోటీలలో అండర్ -14 విభాగంలో ఇద్దరు బాలురు, అండర్ 19 విభాగంలో ఇద్దరు బాలురు పోటీలో పాల్గొనడానికి తరలి వెళ్లారు. వారికి ఎస్కార్టులుగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్ పండా, డి రాము వ్యవహరిస్తున్నారు. పోటీలకు తరలి వెళ్తున్న విద్యార్థులకు రైల్వే స్టేషన్ వద్ద జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సీఈవో జోహార్ ఖాన్, ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలనా అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ అభినందనలు తెలియజేశారు.

# చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించు

* సూపర్ సిక్స్ అమలు చేయలేక లడ్డూపై ఆరోపణలు * వేంకటేశ్వర స్వామి భక్తులకు క్షమాపణ చెప్పండి * ముఖ్యమంత్రి తీరుపై ఎమ్మెల్సీ నర్తు ఆగ్రహం




**సోంపేట, సెప్టెంబర్ 26 (వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ వేంకటేశ్వర స్వామి చిత్రపటానికి శాసనమండలి సభ్యులు నర్తు రామారావు గురువారం క్షీరాభిషేకం చేశారు. లండారు పుట్టుక సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో మాజీ ఎంపీపీ చామంతి, వైసిపి నాయకులు శివాజీ, అశోక్, సంతు, తులసయ్యల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతోనే నడిచిందని తీవ్రంగా ఆరోపించారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడుస్తూ ముఖ్యమంత్రి పీఠాన్ని పొందిన చంద్రబాబు అప్పుడే తీవ్ర అపచారం చేశారని ఎద్దేవా చేశారు. టీటీడీ మీద, వెంకటేశ్వర స్వామి పైన ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తిరుమలలో అపవిత్రం జరిగిందంటూ చేసిన ఆరోపణలను ప్రజలు మరిచిపోరన్నారు. స్వామివారికి చెందిన ఏడుకొండలలో, మూడు కొండలు క్రైస్తవులకు ధారాధాత్తం చేశారని అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు వివాదం చేశారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చాక ఆ వ్యవహారం వదిలేశారు. సారా కాంట్రాక్టర్లను, తీవ్ర అవినీతి ఆరోపణలలో కూరుకుపోయిన వ్యక్తులను తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గంలో కీలక పదవులను ఇచ్చిన రోజు అపవిత్రం అనే ఆలోచన రాలేదా అంటూ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేదానికి గతంలో మీరు ఎన్నో ఆరోపణలు చేశారని, అధికారంలోకి వచ్చాక ఒక ఆరోపణనైన రుజువు చేశారా అని నిలదీశారు. ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన నేపథ్యంలో ప్రజల్లోకి ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం ద్వారా వెళుతున్న సందర్భంగా సూపర్ సిక్స్ హామీల అమలను ప్రజలు ప్రశ్నిస్తారని ముందు చూపుతో డైవర్షన్ రాజకీయాలకు చంద్రబాబు పూనుకున్నారని రామారావు ఆరోపించారు. ఈ దేశంలో ఏ ప్రభుత్వము అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం అమలు చేసిందని ఈ సందర్భంగా రామారావు చెప్పుకొచ్చారు. ఈ వంద రోజుల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందనే విషయాన్ని తెలుసుకున్న చంద్రబాబు మతాన్ని అడ్డం పెట్టుకొని హిందువుల మనోభావాలతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలోనే స్వామి ప్రసాదానికి అపచారం జరిగిందని, ఎవరి అధికారంలో అపవిత్రం జరిగిందో వాళ్లే జబ్బలు చరుచుకుంటూ... గత ప్రభుత్వంపై నిందారోపణలను చేస్తుండడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఆశీర్వదించిన ప్రజలు, ఈ సూపర్ సిక్స్ హామీల అమల్లో స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వం పై విమర్శలను చేస్తున్నారు. ఈ వ్యవహారం నుంచి తప్పించుకోవడానికి ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షుని ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీన ప్రాయశ్చిత్త కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు. చంద్రబాబు నాయుడుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ స్వామివారి దర్శనానికి బయలుదేరుతున్నట్టు రామారావు స్పష్టం చేశారు.

# బాధితులు, కార్యకర్తలకు అండగా ఉంటా

### వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ పేరాడ తిలక్



**టెక్కలి, సెప్టెంబర్ 26(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రతి ఒక్కరి మీద కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అటువంటి బాధితులతో పాటు కార్యకర్తలకు అండగా ఉంటూ వారి తరఫున న్యాయపోరాటం చేస్తామని వైసీపీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ అన్నారు. గురువారం టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకుల కక్ష సాధింపులకు వల్ల ఇల్లు కోల్పోయిన సాహుకరి నీలకంఠేశ్వరరావు కుటుంబాన్ని తిలక్ గురువారం సాయంత్రం పరామర్శించారు. ఇంటిని కోల్పోయిన వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లోని విచ్చలవిడిగా కక్ష సాధింపు చర్యలు చేపడుతూ ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నారన్నారు. వారికి అధికారులు కూడా వత్తాసు పలుకుతుండడం దారుణమన్నారు. ఇది మంచి పద్ధతి కాదని అధిక అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ క్రిష్ణ, వైసీపీ నాయకులు సత్తారు సత్యం, గుజ్జు మోహన్ రెడ్డి, కోరాడ కామేష్, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దుగానపుట్టుగ పోలింగ్ కేంద్రం మార్పు

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 26 (వార్త):** ఎమ్మెల్యే బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయంలో ఎస్ఎస్ఆర్ 2025 నకు సంబంధించిన ఎలక్షన్ క్లెయిమ్‌లు, డెత్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు గురించి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దుగానపుట్టుగ పోలింగ్ కేంద్రం నెం 131 ఇదివరకు బెజ్జిపుట్టుగా స్కూల్ లో వుండేది. ఈ పోలింగ్ కేంద్రం ను దుగాన పుట్టుగ గ్రామం స్కూల్ నకు మార్చుటకు సభ్యులఅందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ ప్రతిపాదన ను ఎమ్మెల్యే కూడా అంగీకారం తెలిపినట్లు డిప్యూటీ తహశీల్దార్ శ్రీవారి చెప్పారు.

## బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం

**హిరమండలం, సెప్టెంబరు 26(వార్త):** 1986-93లో హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన వైశ్యరాజు సుదర్శనరాజు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు కలసి రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని సుదర్శనరాజుకు అందజేశారు. ముమ్ముందు మరింత సాయం అందజేస్తామని పూర్వవిద్యార్థులు తెలిపారు.

## గో సంరక్షణ అందరి బాధ్యత

**హిరమండలం, సెప్టెంబరు 26(వార్త):** గోవుకు మన సంస్కృతిలో ఎంతో ప్రాధాన్యత ఉందని,గో సంపదతో పాటు ఇతర పశు సంపద గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైనదని గో సంరక్షణ అందరి బాధ్యతని ఏపి గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ సూచించారు. గురువారం హిరమండలం మేజం పంచాయతీ పెద్దకోరాడ, భరత్‌నగర్ ప్రేమసాయి వృద్ధాశ్రమంలో గో ప్రేమికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గో సంపద ఆధారంగా అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. నానాటికి తరిగిపోతున్న గోవుల కారణంగా ఏర్పడుతున్న కరువు కాటకాల నేపథ్యంలో గో సంరక్షణ ప్రస్తుత కాలంలో తప్పనిసరి బాధ్యతగా మారిందన్నారు. హిరమండలం మండలంలో గోశాల ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానని జెడ్పీటీసి పొగిరి బుచ్చిబాబు హామినిచ్చారు. పాతపట్నం నియోజకవర్గ బీజేపి ఇన్‌ఛార్జ్ సలాన శరత్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఆవులతో గోశాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం మండల గోసంరక్షణ ప్రేమికుడు కోరాడ వెంకటరమణను సత్కరించారు. అనంతరం గోమాత క్యాలెండర్లను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమసాయి వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఎస్.సాయిబాబా, సత్యసాయి జోనల్ కన్వీనర్ బెహరా సురేష్ (చంటి మాస్టారు), వృద్ధాశ్రమ అధ్యక్షుడు అంధవరపు అబ్బాయి, కోరాడ మురిరాజు, కృష్ణవేణి, జామి జనార్దనరావు, ప్రసాదరావు, సంతోష్‌గుప్తా పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413